# ఎవరి కథ వాళ్ళదే!



## ప్రతాప రవిశంకర్

### మాధవి

నా పేరే మాధవి. ముందుగా నా దొక చిన్న రిక్వెస్ట్. ఈ కథలో నాకు తరవాత శ్యామలరావు, నాగమణి నా గురించి చెడుగా చెప్పవచ్చు. దయచేసి వాళ్ళిద్దరి మాటలని నమ్మకండి. వాళ్ళ ప్రేమ్సు అబ . . .

నే నో విక్టిమ్‌ని. . .ఇప్పుడు నేను అనుభవిస్తున్న నరకం ఆ భగవంతుడికే తెలుసు. ఈ రోజు నా బ్రతుకిలా కావటానికి కారణం శ్యామలరావు... ఆ తర్వాత నాగమణి.

శ్యామలరావుని ప్రేమించటం నేను చేసిన గొప్ప నేరం. . ప్రేమించటం నేరమని ఈ వయస్సులో ఏ కన్నె మాత్రం అనుకుంటుంది? పువ్వు పరిమళించడం ఎంత సహజమైన విషయమో, ఒక వయసులో ఉన్న ఆడది ఒక యువకుడిని ప్రేమించడం కూడా అంతే సహజం కదా!

నా వయస్సు ఇంకా ఇరవై నిండలేదు. . చూపులకు నేను పదహారేళ్ళదానిలా కనిపిస్తానని అమ్మ అందరికీ చెబుతూ ఉంటుంది. అది నిజ

కూడా. ఎన్నోసార్లు రోజుకి అద్దం చూసుకుంటూ ఉంటాను. అందులో నా అందమైన ముఖం ఎంతో లేతగా కనిపిస్తూ ఉంటుంది.

అద్దమంటే గుర్తుకు వస్తూంది. మొదటిసారి ఆ శ్యామలరావు నేను అద్దంలో నా ముద్దు మొహాన్ని చూసుకుంటున్నప్పుడే వచ్చాడు. అతన్ని నేను గమనించనే లేదు. వివిధ కోణాల్లో నా మొహాన్ని చూసుకుంటున్నాను. నా వెనుక నించి నవ్వు వినిపించింది. ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూస్తే నవ్వుతున్న శ్యామలరావు కనిపించాడు. అతని నవ్వు ఎంతో అందంగా ఉంది. నవ్వినప్పుడు అతడి పెదవులు పొగిలినాయి. అతను అలా నవ్వుతూ ఉండడంతో నాకు సిగ్గు ముంచుకొచ్చింది. అద్దాన్ని టేబిల్ మీద ఉంచి "ఎప్పుడొచ్చారు?" అన్నాను.

"నువ్వు అద్దం చూసుకోవటం మొదలు పెట్టినప్పటికే వచ్చాను. అంటే అరగంటయింది." అక్కడే ఉన్న కుర్చీలో కూర్చున్నాడు.

మరింత సిగ్గుతో తల దించుకున్నాను.

"నీ అందం గురించి నన్ను అడిగితే నేను చెప్పనా, మాధవీ. . . అద్దం ఎందుకు?" అన్నాడు.

శ్యామలరావు మాటలు నన్ను గిలిగింతలు పెట్టాయి. అతని మాట లన్నింటికీ నా మౌనమే జవాబు. . .

"ఇంట్లో ఎవ్వరూ లేరు" అన్నాను కొంసేపటి తర్వాత . . . ఎవరయినా వస్తారేమో, మా ఇద్దరినీ అలా చూస్తే బావుండదని నాభయం.

"తెలిసే వచ్చాను" అన్నాడు శ్యామలరావు.

నాకు భయమేసింది. ఒకవైపు అతనితో గంటల తరబడి మాట్లాడాలని ఉంది. కాని మరో వైపు ఎవరయినా వస్తారేమోనని భయం. మా ఇంట్లో వాళ్ళు వస్తే ఏమీ అనుకోరు. వాళ్ళకు శ్యామలరావు అతని తల్లీ, తండ్రీ బాగానే తెలుసు" పక్కింటివాళ్ళు ఎవరయినా వస్తారేమో. . .

నా భయాన్ని శ్యామలరావు గమనించినట్టున్నాడు— కుర్చీలో నుంచి లేచి నిలుచున్నాడు. . .

"సరి నేను వెళతాను."

అప్పుడు గుర్తుకు వచ్చింది నాకు నేనే అతనికి రాసిన ఉత్తరం గురించి... అతన్ని చూడగానే అన్నీ మరిచిపోతాను. . . శ్యామలరావులో ఏదో గొప్ప ఆకర్షణ ఉంది. అతను అందంగా ఉంటాడు. ఆ అందమే నన్ను నిలువునా కూలిపోయేలా చేసింది. అతను ఒక బాంకులో ఉద్యోగం చేస్తున్నాడు.

"నా ఉత్తరం..." చిన్నగా అడిగాను.

"దాని గురించి చెప్పటానికే వచ్చాను. మీవాళ్ళు బయటకు వెళ్ళేదాకా ఆగుతున్నాను. . . ఇదిగో— నా జవాబు" అని షర్టు జేబులో నుంచి ఒక మడత పెట్టిన కాగితాన్ని నా చేతి కిచ్చి గబగబా వెళ్ళి పోయాడు.

ఆత్రంగా ఆ ఉత్తరం మడత విప్పాను. నా చేతులు వణికాయి.

"డియర్ మాధవీ—నువ్వు తొందర పడ్డా నేమో అనుకుంటాను. . . ఇంకో రెండు రోజుల్లో నేను నీకు ఈ ప్రేమలేఖ రాసి ఉండేవాడిని. ఏమయినా ముందుగా ఒక అందమైన అమ్మాయి దగ్గర్నించి ప్రేమ లేఖ అందుకోవటం ఒక గొప్ప అనుభవం కదా. . . థాంక్స్ ఫరిట్. . నువ్వు నా మనసును దోచుకున్నావు. . . ఇప్పుడు నా హృదయమంతటా నువ్వే. . . నాకు నీ ప్రేమ కావాలి. . . నువ్వు కావాలి. . ."

ఇంకా చాలా రాశాడు శ్యామలరావు. ఆ ఉత్తరాన్ని ఎన్నిసార్లు చదివానో లెక్కలేదు. గాలిలో తేలిపోయాను. ఏవో లోకాల్లో విహరించాను.

ఆ తర్వాత నాలుగు రోజులకు శ్యామలరావుకి నాకు అతని మీద ప్రేమను వ్యక్తపరుస్తూ మరో ఉత్తరం రాశాను. అతను దానికి జవాబు రాశాడు. అతను అప్పుడప్పుడు మా ఇంటికి వస్తూ ఉండేవాడు. మే మిద్దరం చిన్నగా మాట్లాడుకునే వాళ్ళం. నేను అతనిపైవు ఆకర్షితురాలినవుతున్నానని మా ఇంట్లో అనుమానపడినా, అభ్యంతర పెట్టలేదు. శ్యామలరావుకేం తక్కువ? అతను నావాడు కావటం కంటే వాళ్ళకు కావలసిన దేముంది?

ఒక రోజు శ్యామలరావు నన్ను ఏదో కల్చరల్ ప్రోగ్రాంకి తనతో రమ్మన్నాడు. . . నాకు భయ మేసింది. ఎందుకో అతనితో వెళ్ళాలనిపించలేదు. ఆశ్చర్యకరమైన విషయం ఇదే. అతన్ని ఎంతో గాఢంగా ప్రేమిస్తున్నా ననుకునేదాన్ని. ఎన్నో ఉత్తరాల్లో నా ప్రేమను అతనికి తెలియపరిచేదాన్ని. కాని అతను ఎప్పుడయినా రోడ్డుమీద కనిపిస్తే నన్ను అతను పలకరిస్తాడేమోనని భయపడిపోయే దాన్ని. అతనితో ఆ ప్రోగ్రామ్‌కి రానని చెప్పేశాను. అతను ఎంతో బాధ పడ్డాడు. అప్పుడు అతని మొహంలో కొంత విసుగు కూడా కనిపించింది. నాకూ బాధ అనిపించింది అతని కోర్కెను తిరస్కరించడం. అయినా ఏదో భయం. నలుగురూ ఏమనుకుంటారు?

అతను నిరుత్సాహంగా వెళ్ళిపోయాడు.

ఆ మరురోజు నుంచీ అతను మా ఇంటికి రావటం మానేశాడు. నేనొక ఉత్తరం రాసినా దానికి రిప్లయ్ ఇవ్వలేదు. అతనికి నా మీద కోపం వచ్చిందనుకున్నాను. వెంటనే అతని కోపాన్ని వదులుకుని మా ఇంటికి రమ్మని ఒక ఉత్తరం రాశాను. అయినా దానికీ జవాబు లేదు. ఏం చెయ్యాలో తోచ లేదు. ఇలాంటి సమయంలోనే పిడుగులాంటి వార్త నా చెవిన పడింది. శ్యామలరావూ — నాగమణికలిసి రోడ్ల వెంట తిరుగుతున్నారట...

ఈ విషయాన్ని నేనెలా నమ్మగలను? నాగమణి ఎవరో కాదు. నా ప్రాణ స్నేహితురాలు. శ్యామలరావును నేను ప్రేమించిన విషయం దానికి తెలుసు. శ్యామల రావుకీ, దానికీ మామూలు పరిచయం ఉన్న విషయం నాకు తెలుసు. ఆ పరిచయం రోడ్ల వెంట తిరిగేంతవరకు వచ్చిందా? అయినా నాగమణి నాకు ఇంత అన్యాయం చేస్తుందా?

నిజంగానే చేసింది. ఒకరోజు సెకండ్ షో సినిమాకు వెళ్ళాను. ముందు వరుసలో శ్యామలరావు, పక్కనే నాగమణి... చూడలేకపోయాను. బయటకు వచ్చేశాను.

ఛీ. . . నాగమణి నాకు ఇంత ద్రోహం చేస్తుందా? ఆ మరురోజునే నాగమణితో గొడవ పడ్డాను. తను అసలు విషయాన్ని బయట పెట్టేసింది. తనూ—శ్యామలరావూ పెళ్ళి చేసుకోబోతున్నా


# మంచి పుస్తకాలు

1. జీవితరహస్యాలు:- దివ్యకామసూత్రాలు. రూ. 5
2. యువతి:- దాంపత్యరహస్యాలు. రూ. 5
3. సంతానము:- గర్భనిరోధ మార్గాలు. రూ. 5
4. చేతిపనులు:- సంపాదన మార్గాలు. రూ. 5
5. అద్భుతహాస్యకథలు:- నవ్వటానికి. రూ. 5
6. రసికప్రియకథలు:- శృంగారహాస్యం. రూ. 5
7. మాస్టర్ప్రతిభాలు:- స్వప్నాలడిక్షనరీ. రూ. 5
8. మానసికశక్తులు:- అర్జీ అష్టసిద్ధులతో. రూ. 5
9. మంత్రశక్తి:- వివిధసాధనరహస్యాలు. రూ. 5
10. ఐదువైద్యవిధానాలు:- అన్నిరోగాలకుచికిత్సలు. రూ. 10
11. ఆహారవైద్యము:- ప్రకృతిఆహారమార్గాలు. రూ. 10
12. మూలికావైద్యము:- అందరికితెలిసినవైద్యంతో. రూ. 10
13. దైవదర్శిని:- బాధలవిముక్తికిదైవరహస్యాలు. రూ. 10
14. వ్యవహారదర్శిని:- నిత్యవ్యవహారవిధానబోధిని. రూ. 10

రూ. 20. ఆపై విలువ ఆర్డర్లకు వి. పి. పోస్టు ఖర్చులు ఉచితం అంతకన్నా తక్కువ ఆర్డర్లకు పోస్టేజి రూ. 4 అదనం

దేశసేవ ప్రచురణలు
5/3 ఆర్‌టి. పంజాగుట్టకాలని, హైదరాబాదు-4

## వాయిదాలమీద ట్రాన్సిస్టర్లు



ఎగుమతి నాణ్యత గల శక్తివంతమైన నేషనల్ డిప్లొమాట్ 4 బాండ్ల అఖిల ప్రపంచ ట్రాన్సిస్టర్‌ను ఇప్పుడు నెలసరి రు. 10 ల సులభ వాయిదాల మీద తెప్పించుకొనండి. వెల రు. 225లు. రెండు సంవత్సరాల గ్యారంటీతో ప్రతి పల్లెకు, బస్తీకి మీ ఇంటికి పంపబడగలదు. మీ ఆర్డరును నేడే పంపండి.

**Indian Trade Agency (WAP)**
**Manakpura, New Delhi- 110005**

## మీకు బేబీ/బాబుకావాలా!



ఆపరేషన్, ఇతర వైద్య చికిత్సలచే నిరాశ చెందిన సోదరీ మణులకు అనేకులకు మా వలన లనే సంతాన వంతులయి ఇచ్చిన యోగ్యతా పత్రములు కలవు. స్త్రీ పురుష వంధ్యాదోష నివారణ నిపుణులు. ఉచిత వివరములకు

**శ్రీ నాగార్జున మూలిక కుటీరం**
**రైల్వేస్టేషన్ వద్ద, రామాలయం వీధి,**
**తెనాలి - 2.**

ఉచితం! ఉచితం !!

**తెల్లమచ్చలు**

అన్ని రకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాత మందు మూడు రోజులలో మార్చును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచారము నిమిత్తము ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి. చిరునామా:

**BHARAT AYURVEDASHRAM.**
P O. Katri Sarai (Gava)

**అంతర్జాతీయ 50 రవ్వల ఆటోమాటిక్ పిస్టల్**

**(లైసెన్సు అక్కరలేదు)**




గట్టి లోహంతో ఆధునిక సాంకేతిక విధానంతో చెయ్యబడింది. ఇది మిమ్ము వన్య మృగముల, దొంగల బారి నుండి కాపాడును. ఇది మిరుమిట్లు గొలిపే మంటను వెలువరిస్తూ పెద్ద శబ్దం చేయును. వెల: లెదర్ కేసు, బెల్టు, 200 రవ్వలు ( ఉచితం ) తో సహా రు. 66—50. అదనపు రవ్వలు 100 రు 5/—లు. పోస్టేజి రు 8—50. శీఘ్రంగా బట్వాడాకు మీ ఆర్డరుతో రు. 8—50 అడ్వాన్సు పంపండి.

**GUN MARSHAL (INDIA) (86)**
**Chhapeti, Aligarh**

**అరబ్బు దేశాలలో ఉద్యోగం**

ఇప్పుడు అరబ్బు దేశాలు, ఇరాన్‌లలో ఉద్యోగం సంపాదించటం చాలా సులభం. ఎవ్వరికీ డబ్బు చెల్లించకండి. సరాసరి దరఖాస్తు వెయ్యండి. **ఫారిన్ ఎంప్లాయ్‌మెంట్ గైడ్** విలువైన భోగటాను. 800ల పైబడిన విదేశీ కంపెనీల అడ్రసులను కలిగిఉంది. గైడ్‌ను పోస్టుద్వారా పొందటానికి రు. 19/-లు ఎం. ఓ. ద్వారా పంపండి. వి. పి. పి. పంపబడదు

**FOREIGN EMPLOYMENT GUIDES**
Chatta Shaikh Mangloo
(Opp. Jamal Press) Jama Masjid.
Delhi-110006 (AP)

రుటు.

ఆ వార్త నా పాలిట పిడుగుపాటే!

ఆరోజునే శ్యామలరావుని దూషిస్తూ పెద్ద ఉత్తరం రాశాను. రెండు రోజుల తరవాత నించి అతన్నించి ఒక ఉత్తరం వచ్చింది. అందులో ఒకే వాక్యం ఉంది. "నువ్వు గొప్ప పిరికి దానివి, మాధవి" దాన్ని ముక్కలు ముక్కలుగా చించేశాను. దుఃఖం ఉప్పెనలా ముంచుకొచ్చింది.

శ్యామలరావు లాంటి దుర్మార్గుడిని ప్రేమించి నందుకు ఫలితం ఇప్పుడు అనుభవిస్తున్నాను . . . భరించలేని నిరాశ . . .జీవితంలో మొట్టమొదటిసారిగా ఒక మగవాణ్ణి ప్రేమించి భంగపడటం.

హృదయం గల ఏ స్త్రీ అయినా ఇంతటి విషాదాన్ని ఎలా భరించగలదు?

ప్రేమించడం ఆడదానికి శాపమా? అవునో కాదో మీరే తేల్చి చెప్పండి . . . మీ జవాబు కోసం ఎదురు చూస్తుంటాను.

## నాగమణి

నన్ను మిత్ర ద్రోహిగా మాధవి మీకు చెప్పి ఉండవచ్చు. దయచేసి ఆ ఉద్దేశాన్ని మీ హృదయాల్లో నుంచి పూర్తిగా తుడిచివెయ్యండి . . . ప్లీజ్ . . .

ఎందుకంటే శ్యామలరావు ఏ రోజు నాకు రోడ్డు మీద కనిపించి ఇక నాకు, మాధవికి ఎలాంటి సంబంధం లేదని చెప్పిన తర్వాతనే నేను అతని జీవితంలోకి ప్రవేశించాను.

అతనికి మాధవి కానప్పుడు ఎవరైతే నేమి? ఇంకో ఆడదాన్ని అతను ప్రేమిస్తాడు. ఆ ఇంకో ఆడదాన్ని నేనే ఎందుకు కాకూడదు? అందుకే మాధవికి వాస్తవాలు తెలియజేస్తూ ఓ ఉత్తరం రాశాను. అతను నా ఆహ్వానాన్ని అందుకున్నాడు. అతను నన్ను ప్రేమించాడు.

ప్రేమించినవాడు కలిస్తే ఇక ఏముంది? పెళ్ళి కాలేదు. పిల్లల్లేరు. నేను మాధవిలా పిరికి దాన్ని కాను. ఇంట్లో కూర్చుని కలలుకనే దాన్ని కాదు . . ప్రేమించినవాడు ఎలాంటి స్త్రీలో ఎలాంటి క్వాలిటీని ఉండాలని కోరుకుంటాడో నాకు బాగా తెలుసు.

ఆ మాత్రం నేను ఊహించగలను. అందుకే అతని మనసు తెలుసుకుని ప్రవర్తించాను. ఇద్దరం పాలు—నీళ్ళలా కలిసి పోయాం.

శ్యామలరావుతో ప్రేమ వ్యవహారంలో మాధవి లాంటి స్నేహితురాలికి ద్రోహం చేస్తున్నాను. ఆ బాధ నాలో కలుక్కుమంటూనే ఉంది. కానీ ఏం చెయ్యగలను? అది ఆమె చేతులారా చేసుకున్నది. ఆమె ప్రవర్తన అతనికి నచ్చలేదు. అతనికి మాధవి మీద ఉన్న ఇష్టం పోయింది. ఇందులో నేను బాధ్యురాలినా? మా ఇద్దరి విషయం మాధవితో చెప్పాలని ఎంతగానో ప్రయత్నించాను. కాని చెప్పలేకపోయాను. కొన్ని రోజుల్లో మాధవికి ఈ విషయం తెలుస్తుందనీ, ఆమే వచ్చి నన్ను అడుగుతుందని అనుకున్నాను. నేను ఎదురు చూసిన రోజే వచ్చింది.

ఒక రోజు మాధవి విసురుగా నా దగ్గరకు వచ్చింది. నిన్న, శ్యామలరావుని ఆ క్రితం రాత్రి సినిమా థియేటర్లో చూసిందట. నోటికి వచ్చినట్టు తిట్టింది. నేనొక మోసగత్తెనని తనని నమ్మకంగా మోసం చేశానని అన్నది. . . . అన్నిటిని ఓర్పుగా భరించాను . . . . నేనేమీ మాట్లాడ లేదు. వెళ్ళిపోయింది. మాధవి ఎలాంటి నరకం అనుభవిస్తున్నదో గ్రహించాను . . . .

జరిగినదంతా శ్యామలరావుతో చెప్పాను అతని గదికి వెళ్ళి. నవ్వాడు. పిరికి వాళ్ళ కథ ఇలాగే ఉంటుందన్నాడు. శ్యామలరావు ఎంత మంచి వాడో అంత చెడ్డవాడు. అతనిలో ఆవేశ గుణాలు బాగానే ఎక్కువ. . . . అతను కేవలం ప్రేమ కబుర్లలో కథలతో కాలక్షేపం అయ్యే మనిషి కాదు . . .అతను ప్రాక్టికల్ మనిషి . . . వారానికి రెండు సినిమాలకు తీసుకువెళ్ళేవాడు . . థియేటర్లలో చిలిపిగా ప్రవర్తించేవాడు. అతన్ని నేను వారించలేను. అతనికి ఏం కావాలో నాకు తెలుసు . . . . అతను నాకు దక్కాలనుకుంటే అతను కోరినట్టుగా ప్రవర్తించక తప్పదు.

నా ఉద్దేశం ఇదే . . .

ఈ ఉద్దేశం తప్పేమోనని నాకు ఇప్పుడు అనిపిస్తోంది . . . .అతను ఒక రోజు అతని గదికి వెళ్ళినప్పుడు నన్ను కోరాడు. . .కాదనలేకపోయాను . . . నన్ను నేను అర్పించుకున్నాను . . .తరవాత నాకు భయమేసింది. జీవితంలో తప్పటడుగు వేశానా? తొందరపడానేమో ననిపించింది. ఆశ్చర్యం . . . అలా అనుకున్న తరవాత శ్యామలరావుకి మరికొన్ని సార్లు లొంగిపోయాను. నాలో కూడా బలహీనత ఉండే ఉండాలి.

ఇప్పుడు నేను మామూలు మనిషిని కాదు. నెల తప్పింది. ఈ విషయం ఇంట్లో తెలియదు. శ్యామలరావుతో చెప్పాను. అతను ఈ విషయాన్ని చాలా ఈజీగా తీసుకున్నాడు. ఇప్పటి నుంచే పిల్లలేమి అన్నాడు . . . ఎబార్షన్ చేయించుకో మన్నాడు. తరవాత ఎప్పుడో పెళ్ళి చేసుకుంటా నన్నాడు . . . .ఎంతగానో ప్రాధేయపడ్డాను. కాని అతని పట్టు సడలలేదు. ఇప్పుడు పిల్లలు వద్దంటాడు. ఎబార్షన్ చేయించుకోమంటాడు.

ఇప్పుడు నాకేం చెయ్యాలో తోచటం లేదు. రోజు రోజుకీ నాలో దిగులు పెరిగిపోతోంది. శ్యామలరావుని చూస్తే భయంగా ఉంది. అతను నన్నేం చేస్తాడు. . . పెళ్ళి చేసుకుంటాడా? మోసం చేస్తాడా?

నాకు ఇప్పుడు అనిపిస్తోంది. మాధవిని నేను నాకు తెలియకుండానే అన్యాయం చేశానా అని ... ఏమో!

ఇక నాకు మరణమే శరణ్యం. కాదంటారా??

## శ్యామలరావు

నాగమణి భయపడుతోంది. నాకు తెలుసు . . . ఇలాగని మీతో చెప్పే ఉంటుంది. నో డవుట్ . . . తప్పకుండా చెబుతుంది. నాగమణి స్వభావం నాకు బాగానే తెలుసు. తొందరపడుతుంది. తరవాత ఆలోచిస్తుంది. . . మాధవి మెంటాలిటీకి పూర్తి విరుద్ధం . . . మాధవి ఆలోచిస్తుంది. కాని ఎటువంటి పరిస్థితుల్లోను తొందరపడదు. అదే నాకు మాధవిలో నచ్చని విషయం. ఒక మనిషిని నువ్వు మనస్ఫూర్తిగా కోరుకుంటున్నప్పుడు, అతన్ని నమ్మినప్పుడు . . అతని మనసు తెలుసుకున్న

అందుకు అనుకూలంగా ప్రవర్తించాలి. ఇది నా ఐడియా . . .కాని— మాధవి నన్ను ప్రేమించా నన్నది—నేనే కావాలన్నది. కాని నాకు తనలో ఏం కావాలో ఇవ్వాలని ఆలోచించలేదు. అందుకే నేను మాధవిని ద్వేషిస్తాను. ఐ హేట్ మాధవి. అలాంటి వాళ్ళు జీవితంలో సుఖాన్ని, సంతోషాన్ని పొందలేరు. వాళ్ళకు జీవితంలో మిగిలేది గుండెల నిండుగా చీకటి.

ఇప్పుడు నే నొక గొప్ప ట్రాజెడీలో ఉన్నాను. నాగమణి నెల తప్పింది. ఈ విషయం తెలిసిన దగ్గర నించీ ఆమెతో సరిగా మాట్లాడలేకపోతున్నాను. ఇప్పుడు నేను నాగమణిని ప్రేమించానా అని అనుకుంటే సరయిన జవాబు రావటం లేదు. అందుకే నాకూ భయంగా ఉంది. నా ప్రవర్తన నాగమణిని పెళ్ళికి మరింత తొందర పెడుతుంది. ఈ దేశంలో పెళ్ళికాని ఆడదానికి నెల తప్పిందంటే ఆమె ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవాలో నాకు బాగానే తెలుసును. నాగమణికి నెల తప్పిందని తెలియగానే నాకు ఆమె మీద ఉన్న క్రేజ్ పోయింది. ఇప్పుడు అనిపిస్తోంది. మాధవి నాకు అనుకూలంగా ప్రవర్తించి ఉన్నట్లయితే ఇప్పుడు ఆమె కూడా నాగమణి స్థితిలోనే ఉండేదేమోనని . . . ఎంత వరకు నిజమంటారు?

తనతో తిరుగుతున్న ఆడదానికి కడుపొచ్చిందని తెలిసినప్పుడు ఏ మగాడికయినా భయం పుడుతుంది. నిజానికి నేను నాగమణిని చేసుకోవచ్చు. కాని ఇప్పుడే పెళ్ళి చేసుకోవటం నాకు ఇష్టం లేదు. అలా అని వూరుకోవటానికి వీల్లేదు. అవతల రోజులు గడిచే కొద్దీ నాగమణిలో నా రూపం పెరిగిపోతోంది. అందుగురించే ఆమె ఆతృత పడుతోంది. ఎబార్షన్‌కి ఒప్పుకోవడం లేదు. ఒక రకంగా నాగమణి ఒప్పుకోక పోవడంలో ఆశ్చర్యం లేదనుకుంటాను. ఎందుకంటే మొట్టమొదటిసారిగా కడుపును తెచ్చుకున్న ఏ ఆడదీ దాన్ని కరిగించుకోవడానికి అంత సులభంగా ఒప్పుకోదు. నాగమణికి నేను చేసుకుంటాననే నమ్మకం మొదట్లో ఉంది. ఇప్పటికీ ఉండేఉండాలి. అందుకే అబార్షన్‌కి ఒప్పుకోవడం లేదు. నాగమణి విషయంలో నేను ఏ నిర్ణయానికీ రాలేకపోతున్నాను.

మరోవైపు—ఇంకో గండం.. మరో ప్యానరలు. నిన్ననే మాధవి నుంచి ఒక ఉత్తరం వచ్చింది. అందులో ఆమె నేను తనని పెళ్ళి చేసుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటానని రాసింది. ఇప్పుడు నేనేం చెయ్యాలి? నాగమణికి నెలతప్పిన విషయం మాధవికి తెలుసునో? లేదో? నాకు తెలియదు. . .ఒకవేళ తెలిసినా మాధవి నన్ను వదులుకునేటట్టుగా కనిపించటం లేదు. ముందు నుయ్యి వెనుక గొయ్యి. అలా దారుణమయిన పరిస్థితి. . .

మాధవా? నాగమణా? ఇందుకు నేను ఎవర్ని ఎన్నుకోవాలి? న్యాయంగా నేను నాగమణిని చేసుకోవాలిగదా. . .కాని, మాధవి నేను ఒప్పుకుపోతే ఆత్మహత్య చేసుకుంటానంటోంది కదా?

ఎలా? ఎలా?

మీరే చెప్పండి. . .ఇప్పుడు నేనేం చేయాలి? పిచ్చెక్కుతుందేమోననిపిస్తోంది. . అలా జరిగితేనే బావుంటుంది కదా?

# రచయిత్రి

వన్ మినిట్. . .

సిగరెట్టు వెలిగించుకుని చెబుతాను. సిగరెట్టు ముట్టించి రెండు దమ్ములు లాగనిదే నేను కథ రాయనూ లేను—చెప్పనూ లేను. ఇది నా బలహీనత. నాకు ఈ బలహీనత ఉన్నట్టే మాధవికీ, నాగమణికీ, శ్యామలరావుకీ కొన్ని బలహీనతలున్నాయి. అయితే ఈ ముగ్గురూ వాళ్ళ గాథలను మీకు చెప్పేటప్పుడు వాళ్ళ అసలు బలహీనతల గురించి మీకు చెప్పలేరు. వాటిని రచయిత్రిగా నేను చెబుతాను. నాకు ఎలాంటి మొహమాటమూ లేదు.

ముందు మాధవి గురించి చెబుతాను. ఆమెకి తెలుగు నవలలు చదివే పిచ్చి బాగా ఉంది. అందుల హీరోయిన్ హీరోని ప్రేమించినట్టుగానే, కలలో కన్నట్టుగానే తను కూడా ఎవరో ఒకర్ని ప్రేమించి కలలు కనాలని అందుబాటులో ఉన్న అందమైన యువకుడు శ్యామలరావును ప్రేమించింది (అలాగని తను అనుకున్నది). కలలు గన్నది. కాని ఆమెకు స్వభావ సిద్ధంగా ఉన్న పిరికితనంవల్ల కలలకీ, వాస్తవానికీ పొత్తు కలపలేక పోయింది. కేవలం కలలోనే తృప్తి పడటం నేర్చుకుని ఎదుటి వ్యక్తి కోర్కెల గురించీ, అవసరాల గురించీ పూర్తిగా మరిచిపోయి ఘోరమైన దెబ్బ తిన్నది. దెబ్బతిన్న తర్వాతగానీ ఆమెకు తను ఎలాంటి స్థితిలో ఉన్నదీ, తను ఏం కోల్పోయిందీ తెలిసి రాలేదు. అందుకే శ్యామలరావుకి అతను తనను చేసుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటానని చెప్పింది. ఐతే ఇది బోగస్ రాతే. మాధవిలో ఆత్మహత్య చేసుకునే బలహీనత లేదు. ఆమెలో ఉన్న బలహీనత కేవలం కలలు కనటమే. సారీ. . .మాధవి జీవితం కలలకే అంకితం. .

ఇక—నాగమణికి ఉన్న గొప్ప బలహీనత తను పరిపూర్ణమైన స్త్రీ అని రుజువు చేసుకోవాలని. తనలో ఇలాంటి వీక్‌నెస్ ఉన్నట్టుగా ఎవ్వరికీ చెప్పదు. కాని ఆమెలో ఇలాంటి ఐడియా ఎప్పటి నుంచో నాటుకు పోయి ఉంది. అందుకే శ్యామలరావుకు అతను కోరినట్టు చెయ్యకపోతే కోపం వస్తుందనే సాకుతో తనని తాను పూర్తిగా అర్పించుకుంది. అందుకే ఇప్పుడు భయపడుతున్నది. ఇలా తను నూరుపాళ్ళూ ఆడదిగా రుజువు పరచుకోవాలనే ఆడదానికి ఇలాంటి తొందరపాటూ ఆ తర్వాత భయం బాధ ఏడుపు తప్పవు... పరిస్థితులను చూస్తే నాగమణి తప్పకుండా ఆత్మహత్య చేసుకుంటుంది.

ఇక శ్యామలరావు గొప్ప బ్రూట్. . .వాడికి ప్రేమంటే ఏమిటో తెలీదు. వాడు మాధవిలాగే ప్రేమిస్తున్నా ననుకుంటాడు. కనిపించిన ప్రతి ఆడదాన్నీ తన అందంతో మోహింపచేసి లవ్ చేసి పారేయాల్యనుకుంటాడు. ఇది శ్యామలరావులో ఉన్న పెద్ద బలహీనత. ఇలాంటి వాళ్ళ జీవితం మొదట్లో బాగానే ఉన్నా రెండు మూడు కేసుల తర్వాత తను ప్రేమించాననుకున్న ఆడవాళ్ళ చేతనే దెబ్బలు తినే పరిస్థితికి దారితీయవచ్చు. ఆ రోజున శ్యామలరావుకు మిగిలేది పతనమే. ఇలాంటి పతనాన్ని శ్యామలరావు భరించగలడా? బహుశా భరించలేక పోవచ్చు. ఒకవేళ మాధవిగానీ,నాగమణిగానీ, ఇద్దర్లో ఏ ఒక్కరు ఆత్మహత్య చేసుకున్నా శ్యామలరావు పని అవుట్. ఆ తర్వాత శ్యామలరావు జీవితం!? నాకు తెలీదు. *

సూపర్ బాల్ పెన్....
హాయిగా,మెత్తగా రాసేది.

కేమ్లిన్
121 జాటర్

లక్షలాది ప్రజల అభిరుచులకు అనువుగా ఉండేలా రకరకాల రంగులలో దొరుకుతుంది. ఈ ధరలో దొరికే బాల్ పెన్‌లలో దీనిని మించినది మరేది ఉంటుంది!




S 795 Tel